సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 18 । నవంబర్ । 2023



స్విమ్మింగ్‌లో పతకాలు

ఏలూరుకి చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించారు.

10లో ▸



నేడు సామాజిక బస్సు యాత్ర

వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం తణుకులో జరుగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

10లో ▸



గ్రంథాలయాల వైపు..

విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించేలా గ్రంథాలయాల్లో పలు కార్యక్రమాలు, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

10లో ▸

నూజివీడుకు వరాల జల్లు



అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



నూజివీడులో సభకు హాజరైన అశేష ప్రజానీకం

- రూ.275 కోట్లతో మామిడి పల్ప్, ప్రాసెసింగ్ యూనిట్లు
- ప్రాధాన్యతా క్రమంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి
- వార్డు సచివాలయాల పరిధిలో పనులకు రూ.16 కోట్లు
- ముఖ్యమంత్రి జగన్ వరాల వెల్లువ
- సభకు భారీగా తరలిన జనం
- అడుగడుగునా నీరాజనం
- నయా జోష్ నింపిన సీఎం పర్యటన



సభావేదికపై సీఎం జగన్, చిత్రంలో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, తానేటి వనిత, పినిపే విశ్వరూప్, మేరుగ నాగార్జున, ఎంపీలు మిథున్‌రెడ్డి, కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, తలారి వెంకట్రావు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తదితరులు

సాక్షి ప్రతినిధి,ఏలూరు/నూజివీడు: నూజివీడు మామిడి రైతులకు సర్కారు తోడుగా నిలుస్తోంది. మామిడి రైతుల సంక్షేమం కోసం రూ.275 కోట్లతో మ్యాంగో పల్ప్, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. అలాగే నూజివీడు మున్సిపాల్టీల్లోని 16 వార్డు సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ.16 కోట్ల నిధుల విడుదల, చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రాధాన్య క్రమంలో పూర్తితో పాటు నియోజకవర్గ అభివృద్ధికి వరాలజల్లు కురిపించారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సభలో కోరిన వెంటనే అన్నీ మంజూరు చేస్తానని సీఎం జగన్ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో ముఖ్యమంత్రి పర్యటించారు.

బారులు తీరిన జనం : నూజివీడులో హెలీప్యాడ్ వద్దకు చేరుకున్న సీఎం జగన్‌కు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ నుంచి సీఎం జగన్ సుమారు 5.8 కిలోమీటర్లు బస్సులో ప్రయాణించి బహిరంగ సభావేదిక వద్దకు చేరుకున్నారు. దారిపొడవునా అశేష జన వాహిని, రోడ్డుకిరువైపులా బారులు తీరి ఘన స్వాగతం పలికారు. సభాప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రి తొలుత జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం బహిరంగ సభలో సుదీర్ఘంగా ప్రసంగించారు.

శాశ్వత హక్కు కల్పిస్తూ..

రాష్ట్రవ్యాప్తంగా 20,24,709 మంది పేదలకు లబ్ధి చేకూర్చేలా 35,44,866 ఎకరాల భూములను సర్వ హక్కులతో పంపిణీకి సభలో ప్రసంగించి రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని సీఎం జగన్ నూజివీడు నుంచి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లాలో 693.25 ఎకరాల భూమిని 752 మందికి పంపిణీ చేశారు. అలాగే 13,165 మందికి చెందిన 16,446 ఎకరాల భూమిని 22(ఎ) నుంచి తొలగించి రైతులకు శాశ్వత హక్కు కల్పించేలా చేశారు. దీంతో పాటు జిల్లాలోని 31 గ్రామాల్లో 33.32 ఎకరాల భూమిని ఎస్సీలకు శ్మశాన వాటికల కింద కేటాయించి గ్రామ పంచాయతీలకు అప్పగించారు.

మామిడికి పెద్దపీట : నూజివీడు నియోజకవర్గంలో మామిడి రైతుల సంక్షేమం కోసం మ్యాంగో పల్ప్, ప్రాసెసింగ్ యూనిట్‌కు త్వరలోనే పునాదిరాయి వేస్తామని సీఎం జగన్ ప్రకటించారు. ఇప్పటికే దీనికి సంబంధించిన డీపీఆర్ ఆమోదం పొంది బ్యాంకర్ల పరిశీలనకు వెళ్లిందని చెప్పారు. అలాగే మున్సిపాల్టీలోని 16 వార్డు సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులకు ఒక్కో సచివాలయానికి రూ.కోటి చొప్పున రూ.16 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని యుద్ధప్రాతిపదికన ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ధర్మాన ప్రసాదరావు, తానేటి వనిత, పినిపే విశ్వరూప్, మేరుగు నాగార్జున, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, కోటగిరి శ్రీధర్, ప్రభుత్వ సలహాదారు అజయ్‌కల్లాం, జెడ్పీ చైర్‌పర్సన్లు ఘంటా పద్మశ్రీ, ఉప్పాల హారిక, ఎమ్మెల్యేలు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు, దూలం నాగేశ్వరరావు, వీఆర్ ఎలీజా, తలారి వెంకట్రావు, సామినేని ఉదయ భాను, పేర్ని నాని, కొక్కిలిగడ్డ రక్షణనిధి, ఎమ్మెల్సీలు జయమంగళ వెంకటరమణ, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ డి.మేరీప్రశాంతి, సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ జి.దేవి, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ వెజ్జు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జై జగన్ నినాదాలు

సభా వేదిక వద్ద జై జగన్ నినాదాలు హోరెత్తాయి. సీఎం ప్రసంగం ఆద్యంతం ప్రజల హర్షధ్వానాల మధ్య కొనసాగింది. అలాగే తిరుగు ప్రయాణంలో హెలీప్యాడ్ వద్ద సీఎం జగన్ పలువురితో మాట్లాడారు. వినతులు స్వీకరించి 9 మందికి తక్షణ ఆర్థిక సాయం ఇవ్వాలని ఆదేశించి రూ.9 లక్షల చెక్కులు పంపిణీ చేశారు.

స్టాల్స్ సందర్శన

సభావేదిక వద్ద స్టాల్స్‌ను సీఎం జగన్ సందర్శించారు. జగనన్న భూహక్కు–భూరక్ష, జగనన్న ఇళ్ల నిర్మాణాలు, ఎంఐజీ లేఅవుట్లు, సంక్షేమ పథకాలు, సచివాలయ భవనాలు, ఆర్బీకేల నమూనాలతో ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖ కమిషనర్ సిద్ధార్థజైన్, అదనపు సీసీఎల్ఏ ఇంతియాజ్ వివరాలు తెలియజేశారు.

దశాబ్దాల సమస్యలకు పరిష్కారం

ముఖ్యమంత్రి తీసుకున్న గొప్ప నిర్ణయంతో దశాబ్దాలుగా పరిష్కారం కాని భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. జిల్లాలోని ఆరు గ్రామాల్లో భూసర్వే పూర్తయిందని, త్వరలోనే యాజమాన్య పత్రాలు అందిస్తామన్నారు. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు.



వీణ బహూకరణ : సీఎం జగన్‌కు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జేసీ లావణ్యవేణి తదితరులు వీణను బహూకరించారు. అలాగే ఎమ్మెల్యే అప్పారావు నూజివీడు పెద్దరసం మామిడి కాయలను ముఖ్యమంత్రికి అందజేశారు.





ఘన స్వాగతం : హెలీప్యాడ్ వద్ద సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, మంత్రి తానేటి వనిత, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, కొఠారు అబ్బయ్యచౌదరి, తెల్లం బాలరాజు, వీఆర్ ఎలీజా, తలారి వెంకట్రావు, దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



జయహో జగన్.. జేజేలు పలుకుతున్న మహిళలు



ఘన నివాళి.. వైఎస్సార్ విగ్రహానికి నమస్కరిస్తూ..



అభివృద్ధే లక్ష్యంగా.. స్టాల్స్‌ను పరిశీలిస్తూ..

దేశానికే తలమానికంగా పథకాలు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

దేశంలో ఎక్కడాలేనన్ని పథకాలు రాష్ట్రంలో సీఎం జగన్ అమలు చేస్తున్నారని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నాడు దివంగత సీఎం వైఎస్సార్ పేదలకు భూ పంపిణీ చేస్తే మరలా నేడు సీఎం జగన్ భూపంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. అలాగే నూజివీడు నియోజకవర్గంలో 40 వేల మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చిందని, ఏ ముఖ్యమంత్రి పేదలు, మహిళలు, రైతుల కోసం పనిచేస్తున్నారో ప్రజలు గుర్తించాలన్నారు. ఎన్నికల ముందు జగన్ ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అమలు చేసి చూపించారన్నారు. నియోజకవర్గంలో 11 వేల మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడమే కాకుండా పక్కా ఇళ్లను ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. అలాగే నియోజకవర్గంలో 473 మందికి 323.495 ఎకరాల భూమికి పట్టాలు అందిస్తున్నామని, 2,666 మంది పేదలకు సంబంధించిన 2842.70 ఎకరాలను నిషేధిత జాబితా 22(ఏ) నుంచి తొలగించి అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కులను కల్పిస్తున్నామన్నారు. సింహం సింహాసనంపై కూర్చుని ఉందని, ప్రతిపక్షాలు ఏమీ చేయలేవని అన్నారు.

కాంగ్రెస్‌తో అంటకాగుతున్న చంద్రబాబు

కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎన్టీఆర్ టీడీపీని స్థాపిస్తే ఇప్పుడు చంద్రబాబు అదే కాంగ్రెస్‌తో అంటకాగుతున్నాడని ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి రాష్ట్రంలో ఒక్క సీటు కూడా రాదని, 175కి 175 సీట్లు వైఎస్సార్‌సీపీ సాధిస్తుందన్నారు. టీడీపీకి ఓటేస్తే గోదావరిలో వేసినట్లేనని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నూజివీడు మూడుసార్లు వచ్చి మూడు మొక్కలు నాటారని, నూజివీడు ప్రాంతంలో రాజధాని అని శాసనసభ సాక్షిగా ప్రకటించి ఆ తర్వాత వేరేచోట ఏర్పాటుచేసి ఈ ప్రాంతానికి తీరని ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. నారా లోకేష్ రాజకీయాలకు పనికిరాడని అన్నారు.

న్యూస్‌రీల్

మంత్రి కొట్టు పూజలు



పుట్ట వద్ద పూజలు చేస్తున్న మంత్రి కొట్టు

ఉంగుటూరు: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబసమేతంగా గోపీనాథపట్నంలో నాగులచవితి పండుగను ఘనంగా నిర్వహించారు. తన వ్యవసాయ క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి పుట్టలో పాలు పోసి నైవేద్యాలు సమర్పించారు. ఆయన భార్య సాదినికుమారి, సోదరుడు తాతాజీ, కుటుంబసభ్యులు ఉన్నారు.

21న మత్స్యకార దినోత్సవం



ముదునూరి ప్రసాద రాజు, చీఫ్ విప్

నరసాపురం: ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని ఈనెల 21న నరసాపురంలో ఘనంగా నిర్వహించనున్నట్టు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, కలెక్టర్ పి.ప్రశాంతి హాజరవుతారన్నారు. అలాగే అదేరోజు దేశంలోనే మూడోవదిగా నరసాపురంలో రూ.750 కోట్ల బడ్జెట్‌తో ఏర్పాటుకానున్న ఫిషరీష్ యూనివర్సిటీకి సంబంధించి తరుగతులు ప్రారంభిస్తామన్నారు. ఓ వైపు యూనివర్సిటీ పనులు జరుగతుండగా, ఈ ఏడాది తాత్కాలిక భవనాల్లో తరగతులు ప్రారంభిస్తామన్నారు. పట్టణంలో పునః నిర్మించిన చేపల మార్కెట్‌ను కూడా అదేరోజు ప్రారంభిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కూడా మొదలుకానుందన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



'జగనన్నకు చెబుదాం'లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వీరవాసరం: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కారించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. జేసీ ఎస్.రామ సుందర్‌రెడ్డితో కలిపి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి స్పందన కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో మండలస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జగనన్నకు చెబుదాంలో 72 అర్జీలు స్వీకరించారు.

ఉద్యోగుల గ్రీవెన్స్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల గ్రీవెన్స్ చక్కటి వేదిక అని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. ఉద్యోగుల గ్రీవెన్స్‌లో ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉద్యోగుల సర్వీసు మేటర్స్, పెన్షన్ సమస్యలు, ఆర్థిక అంశాలు, క్రమశిక్షణ కేసులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యలపై అర్జీలు అందించవచ్చన్నారు. మొత్తం 9 దరఖాస్తులు స్వీకరించారు.

ముందస్తు సాగుతో నీటి ఎద్దడి నివారణ

పెనుమంట్ర: దాళ్వాలో ముందస్తు సాగుకు వెళ్లడం ద్వారా సాగునీటి ఎద్దడిని అధిగమించవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం మార్టేరు వరి పరిశోధనా స్థానంలో జరిగిన రైతులు, మిల్లర్లు, ఎగుమతిదారులు, శాస్త్రవేత్తల భాగస్వామ్య సదస్సులో ఆమె మాట్లాడారు. డిమాండ్‌గా ఉన్న వరి వంగడాలను మండలంలో కొన్ని క్లస్టర్లుగా ఏర్పడి సాగు చేయాలన్నారు. దాళ్వా సాగుకు వచ్చే నెల 15లోపు నారుమడులు వేసుకుని, నాట్ల పనులు మొదలుపెట్టాలన్నారు. ఎంటీయూ 1121 వంగడాన్ని 125 రోజుల్లో పండిస్తున్నారని, కోత కోసి తేమ అధికంగా ఉండగానే మిల్లులకు తరలించడంతో నూక అధికంగా వస్తుందన్నారు. ఆచార్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు ఎ.సుబ్బరామిరెడ్డి అధ్యక్షత వహించారు. పరిశోధనా స్థానం ఏడీఆర్ ఎం.భరత్‌లక్ష్మి, పాలకవర్గ సభ్యుడు చింతా ఈశ్వరరావు, వ్యవసాయ అధికారులు జెడ్.వెంకటేశ్వరరావు, మాధవరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం ప్రభుత్వాస్పత్రికి

ముస్కాన్ నిధులు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం ప్రభుత్వాస్పత్రి ముస్కాన్ నిధులకు ఎంపికైందని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.వీరాస్వామి శుక్రవారం తెలిపారు. మొత్తం రూ.6 లక్షల నిధులు వస్తాయని, ముందుగా రూ.3 లక్షలు విడుదలవుతాయన్నారు. సేవలు విస్తరించిన అనంతరం మరో రూ.3 లక్షలు విడుదల చేస్తారన్నారు. గత జూలైలో కేంద్ర బృందం ఆస్పత్రిని పరిశీలించిందని, ఈ మేరకు నిధులకు ఎంపికైందని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



నరసాపురం రూరల్: దుర్గా లక్ష్మణేశ్వరస్వామి ఆలయంలో..

జిల్లావ్యాప్తంగా నాగులచవితి

పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు నాగుల పుట్ట వద్దకు వెళ్లి పాలు పోసి, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. బాణసంచా కాల్చి వేడుకలు చేసుకున్నారు. శైవక్షేత్రాల్లో విశేష అభిషేకాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



తాడేపల్లిగూడెం (టీఓసీ) : పాతూరులో పుట్ట వద్ద పూజలు

గ్రంథాలయాల వైపు.. చిన్నారుల చూపు

- పఠనాసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి
- జిల్లాలోని గ్రంథాలయాలకు రూ. 56 లక్షల విలువైన పుస్తకాలు
- ప్రతీ ఆదివారం విద్యార్థులతో 'చదువంటే మాకిష్టం'
- వేసవిలో ప్రత్యేక శిక్షణ తరగతులు


భీమవరంలోని గ్రంథాలయంలో 'చదువుకంటే మాకిష్టం' కార్యక్రమంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

సాక్షి, భీమవరం : విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించడం ద్వారా వారిలో విజ్ఞాన సముపార్జనకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రతీ ఆదివారం చదువంటే మాకిష్టం, ప్రతీ నెల మొదటి శనివారం మనం–మన గ్రంథాలయం కార్యక్రమాలతో పాటు వేసవి, దసరా సెలవుల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. వీటితో గ్రంథాలయాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని గ్రంథాలయ అధికారులు అంటున్నారు. విద్యార్థులు, పాఠకుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు 56వ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 76 వరకు గ్రంథాలయాలు ఉన్నాయి. ఏలూరులో కేంద్ర గ్రంథాలయం ఉండగా, గ్రేడ్–1 ఐదు, గ్రేడ్–2 ఒకటి, గ్రేడ్–3 గ్రంథాలయాలు మూడు ఉన్నాయి.

పఠనాసక్తి పెంపొందించేందుకు..

ప్రస్తుతం చిన్నారులకు స్మార్ట్‌ఫోన్లు వ్యసనంగా మారుతున్నాయి. ఖాళీ దొరికితే చాలు పుస్తకాలు పక్కనపెట్టి సెల్‌ఫోన్‌లో మునిగిపోతుంటారు. పుస్తకపఠనం పట్ల ఆసక్తిని కలిగించి విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం గ్రంథాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రతీ ఆదివారం విద్యార్థులతో చదువంటే మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులను రప్పించి వారికి తెలుగు నేర్పడం, కథలు చదివించడం, పుస్తక పఠనం ప్రాధాన్యతను వివరిస్తున్నారు. స్వాతంత్య్ర సమరయోధులు, సామాజికరంగంలో రాణించినవారి జీవిత చరిత్ర పుస్తకాలను అందుబాటులో ఉంచారు. గ్రంథాలయాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పాఠకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రతీ నెల మొదటి శనివారం మనం–మన గ్రంథాలయం కార్యక్రమం అమలుచేస్తున్నారు. పుస్తకాలపై బూజు దులపడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం చేస్తున్నారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా 32 రోజుల పాటు వేసవి శిక్షణను ఈ ఏడాది నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. పుస్తకాలను చదివించడం, కథలు చెప్పించడం, ప్రముఖులతో అవగాహన సదస్సులు ఏర్పాటుచేయడం, చెస్, క్యారమ్స్ తదితర ఆటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

డిజిటలైజేషన్ దిశగా అడుగులు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని గ్రంథాలయాల డిజిటలైజేషన్‌కు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన అన్ని స్టడీ మెటీరియల్స్, న్యూస్ పేపర్లు, మ్యాగజైన్లు అందుబాటులో ఉంటాయి. ఏలూరు జిల్లా గ్రంథాలయంలో డిజిటలైజేషన్ పూర్తి కాగా గ్రేడ్–1, గ్రేడ్–2 గ్రంథాలయాల్లో గ్రేడ్–1, గ్రేడ్–2 గ్రంథాలయాల్లో డిజిటలైజేషన్‌కు చర్యలు తీసుకుంటున్నారు. నర్సాపురంలో రూ. 1.28 కోట్లు, తణుకులో రూ. 1.03 కోట్లుతో గ్రంథాలయాల నూతన భవన నిర్మాణాలకు చర్యలు చేపట్టారు. నర్సాపురంలో ఇప్పటికే పునాది దశ వరకు పనులు పూర్తయ్యాయి. రీడర్ ఆన్ డిమాండ్ పేరుతో పుస్తకాలు కూడా సరఫరా చేస్తున్నారు.

ఘనంగా గ్రంథాలయాల వారోత్సవాలు

ఏటా నవంబరు 14 నుంచి 20వ తేదీ వరకు ప్రభుత్వం గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తుంది. వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఔత్సాహికులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, కథలు, ఆటలు, క్విజ్, పాటలు, డ్యాన్సులు తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. ముగింపు వేడుకల్లో ఆయా పోటీల్లోని విజేతలకు జ్ఞాపికలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. గత వేసవిలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు, గ్రంథాలయ వారోత్సవాలకు ప్రభుత్వం సుమారు రూ. 20 లక్షలు వరకు నిధులు మంజూరు చేసింది.

ప్రత్యేక కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి



గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయి. గ్రంథాలయాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య పెరిగింది. నిరుద్యోగుల కోసం పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నాం. వీటిని ఉపయోగించి చాలా మంది గ్రూప్–1, గ్రూపు–2, సివిల్స్ వంటి పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తున్నారు.

– శేఖర్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, ఏలూరు

క్లుప్తంగా

స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు




షేక్ హాకిల్ షేక్ హకీమ్ ఏ.రిషివంత్

ఏలూరు రూరల్: ఏలూరు నగరానికి చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించారు. ఈ నెల 9 నుంచి 11 వరకూ చిత్తూరు జిల్లాలో 67వ అంతర జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. పోటీల్లో పాల్గొన్న శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి షేక్ హాకిల్ అండర్–19 విభాగంలో 100, 200 మీటర్ల బట్లర్‌ఫ్లై అంశాల్లో సిల్వర్ మెడల్స్ సాధించాడు. షేక్ హకీమ్ అండర్–14 విభాగంలో 200 మీటర్ల బటర్‌ఫ్లై అంశంలో బ్రాంజ్ మెడల్ చేజిక్కించుకున్నాడు. సర్ సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఏ.రిషివంత్ అండర్–17 విభాగంలో 200 మీటర్ల బటర్‌ఫ్లై అంశంలో బ్రాంజ్ మెడల్, 400 మీటర్ల ఐఎం అంశంలో మరో బ్రాంజ్ మెడల్ సొంతం చేసుకున్నాడు.

శబరిమలకు నర్సాపురం నుంచి ప్రత్యేక రైలు

ఏలూరు (టూటౌన్) : శబరిమల యాత్రికుల కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 07119/07120 నెంబరుతో నర్సాపురం–కొట్టాయం–నర్సాపురం మధ్య రైలు నడుస్తుందన్నారు. ఈ ప్రత్యేక రైలు ఈ నెల 19న ఆదివారం సాయంత్ర 3.50 గంటలకు నర్సాపురంలో బయలుదేరి మరుసటి రోజు సోమవారం సాయంత్రం 4.50 గంటలకు కొట్టాయం చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 20న సోమవారం సాయంత్రం కొట్టాయంలో బయలు దేరి మరుసటి రోజు మంగళవారం రాత్రి 9 గంటలకు నర్సాపురం చేరుకుంటుందన్నారు. ఈ రైలు పాలకొల్లు, భీమవరం, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు తదితర స్టేషన్లలో ఆగుతుందన్నారు. ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని తెలిపారు.

మావుళ్లమ్మ సన్నిధికి భద్రాద్రి రామయ్య రథం



భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానానికి భద్రాచలంలో సీతారాముల రథం చేరుకుంది. అలాగే భద్రాచలం సీతారాముల దేవస్థానం ఈవో రమాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

'శ్రీ వీరప్రతాప 1940' పోస్టర్ ఆవిష్కరణ


భీమవరంలో శ్రీ వీరప్రతాప..1940 సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అంబికా కృష్ణ తదితరులు

భీమవరం : చిన్న సినిమాలపై అనేకమంది సినీ కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని సినీ నిర్మాత, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అంబికా కృష్ణ అన్నారు. భీమవరం పట్టణానికి చెందిన ఆదిత్య కృష్ణంరాజు నిర్మాణ సారథ్యంలో ఆదిత్య క్రియేషన్స్ బ్యానర్‌పై డాక్టర్ వేల్పుల నాగేశ్వరరావు దర్శకత్వంలో నిర్మించిన శ్రీ వీరప్రతాప..1940 సినిమా పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సినీ రంగం పెద్ద హీరోల చుట్టూనే తిరుగుతుందని దీంతో ఏడాదికి 20 సినిమాలకు మించి నిర్మాణానికి నోచుకోవడం లేదన్నారు. సినీ రంగంపై అనేక విభాగాల్లో ఎంతోమంది ఆధారపడి జీవిస్తున్న వారికి చిన్న సినిమాలే ఆధారమవుతున్నాయన్నారు. చిన్న సినిమాలు ఏడాదికి 100కు పైగానే విడుదలవుతున్నాయని తెలిపారు. దర్శక, నిర్మాతలు నాగేశ్వరరావు, కృష్ణంరాజు మాట్లాడుతూ రాజా రవీంద్ర, చరిష్మా, గుంటూరు రాము, జబర్దస్త్ రాజమౌళి, కర్తనందం, చిట్టిబాబు నటించిన ఈ సినిమాలో అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలుంటాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ, పాపారావునాయుడు, కంతేటి వెంకటరాజు, వబిలిశెట్టి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


వైద్య పరీక్షల అనంతరం మహిళలకు మందులు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వం ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. వైద్య శిబిరం వద్ద ఏర్పాటు చేసిన వివిధ వైద్య పరీక్షల విభాగాలను పరిశీలించి అక్కడి వైద్యులతో చర్చించారు. అనంతరం వైద్య శిబిరానికి పరీక్షలకు వచ్చిన మహిళలతో మాట్లాడారు. వారికి ఉన్న ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి సామ్యూల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడేపల్లిగూడెంలో నాలుగు మెగా వైద్య శిబిరాల్లో 24,414 మంది మహిళలు, 21,620 మంది పురుషులకు వైద్యచికిత్సలు చేసి మందులు ఉచితంగా అందించారన్నారు. 5,236 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారన్నారు. కంటి పరీక్షలకు వచ్చిన వారికి కంటి చూపు పరీక్షలు నిర్వహించి అవసరమైన 526 మందికి కళ్ళజోళ్లు పంపిణీ చేస్తారన్నారు. 1040 మంది బాలింతలు, గర్భిణులకు పరీక్షలు నిర్వహించిన పోషకాహారాన్ని, మందులను అందచేశారన్నారు. 3,022 మందికి థైరాయిడ్ పరీక్షలు నిర్వహించారన్నారు. 126 మంది వైద్య నిపుణులు, 237 మంది వైద్యులు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో సేవలు అందించారన్నారు. ఈ క్యాంపులకు రాజమండ్రి జీఎస్ఎల్ ఆస్పత్రి వైద్యులు అందించిన సేవలు అభినందనీయమన్నారు. ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఆనందరావుకు నమ్మకంతో జీఎస్ఎల్ ట్రస్ట్ బాధ్యతలను అప్పగించారన్నారు.

మళ్లీ జగన్‌కే పట్టం

జగన్ అందిస్తున్న సంక్షేమ పాలన చూసిన రాష్ట్ర ప్రజలందరూ మళ్ళీ జగన్‌కే ముఖ్యమంత్రిగా పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాలు, పంటకు పెట్టుబడి తదితర సౌకర్యాలు అమలు చేస్తున్నారన్నారు. పరిశ్రమలతో రాష్ట్రం అభివృద్ధి చెందడంతోపాటు ఉపాధి అవకాశాలు అధికమవుతాయనే ఉద్దేశంతోనే పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. నాడు నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ సంస్థలను మించి ఉన్నాయన్నారు. జగనన్న సంక్షేమ పాలనకు, చంద్రబాబు దుర్మార్గానికి వ్యత్యాసాన్ని గుర్తించిన ప్రజలు సంక్షేమ రాజ్యం కొనసాగడానికి వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిగాను, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యనారాయణ, ఏఎంసీ ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, గుండుబోగుల నాగు, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, బొద్దు సాయిబాబు, బోణం విజయనిర్మల, పత్సమట్ల సావిత్రి, యజ్జల రాంబాబు, అశోక్, సంపతరావు కృష్ణారావు, తాళ్ళూరి మురళీకృష్ణ, విజయభాస్కరరెడ్డి, వట్టి బుజ్జి, చామన సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు తణుకులో బస్సు యాత్ర


బస్సు యాత్రకు ముస్తాబవుతున్న వేదిక ప్రాంతం


తణుకు వేల్పూరు రోడ్డులో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, పార్టీ జెండాలు

తణుకు అర్బన్: సామాజిక సాధికార బస్సు యాత్రకు తణుకు ముస్తాబైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజికంగా తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు ప్రజలకు తెలిపేందుకు ప్రజాప్రతినిధులంతా బస్సు యాత్ర చేయనున్నారు. రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముందుగా మధ్యాహ్నం ఒంటి గంటకు జాతీయ రహదారికి సమీపంలో ఉన్న నెక్ కల్యాణ మండపంలో విలేకరుల సమావేశం, అనంతరం వేల్పూరు రోడ్డులోని భాష్యం స్కూలు ప్రాంతం నుంచి సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభించనున్నారు. ఈ యాత్రలో భాగంగా మోటారు సైకిళ్ల ర్యాలీతోపాటు బస్సు యాత్ర జరగనుంది. తణుకు రాష్ట్రపతి రోడ్డులోని ట్రెండ్స్ షాపింగ్ మాల్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన వేదికపై నుంచి సామాజిక అంశాలను ప్రజలకు చేరవేయనున్నారు. ఈ యాత్రకు భారీ సంఖ్యలో ప్రజలు రానున్న నేపథ్యంలో తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

యాత్రలో పాల్గొనే ప్రజాప్రతినిధులు వీరే

ఈ బస్సు యాత్రలో ముఖ్య అతిథులుగా ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దాడిశెట్టి రాజా, రాష్ట్ర మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జోగి రమేష్, ఉషశ్రీ చరణ్, మేరుగ నాగార్జున, ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, నందిగం సురేష్, మార్గాని భరత్, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్సీలు పోతుల సునీత, వంక రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, నటుడు ఆలీ, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లెం ఆనంద్ ప్రకాష్ తదితరులు పాల్గొంటారు.

జయహో.. టీం ఇండియా

- రేపు వరల్డ్ కప్ ఫైనల్ నేపథ్యంలో యువతలో జోష్
- పలుచోట్ల భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు


కైకలూరులో స్క్రీన్‌పై మ్యాచ్ వీక్షించడానికి రావాలని ఆహ్వానిస్తూ బ్రోచర్

కైకలూరు : మరికొన్ని గంటల వ్యవధిలో క్రికెట్ ప్రపంచ కప్ తుది సమరం మొదలుకానుంది. టీం ఇండియా క్రికెట్ విశ్వ కిరీటాన్ని ముద్దాడాలని యువత మంచి జోష్ మీదుంది. ఆదివారం జరిగే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించడానికి ఉమ్మడి జిల్లాలో క్రికెట్ అభిమానులు ఎక్కడికక్కడ భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. కైకలూరు టౌన్ హాలు గ్రౌండ్‌లో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ యువనాయకులు ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి భారీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. క్రికెట్ అభిమానులు వచ్చి మ్యాచ్‌ను వీక్షించాలని సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేశారు. విజయం సాధిస్తే పెద్ద ఎత్తున బాణసంచా కాల్చడానికి, జాతీయ జెండాలను ఊరేగించడానికి సర్వం సిద్ధం చేశారు.

హోటల్స్ బుకింగ్

సాధారణంగా సంక్రాంతి రోజుల్లో కోడిపందాలకు హోటల్ రూంల బుకింగ్ ఎక్కువగా ఉంటుంది. అయితే ఈసారి వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ చూడడానికి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, నరసాపురం, పాలకొల్లు, ఏలూరు జిల్లా ఏలూరు, కైకలూరు, తాడేపల్లిగూడెం వంటి ప్రాంతాల్లో పలువురు హోటళ్లను బుక్ చేసుకున్నారు. సరదాగా స్నేహితులు కలసి టీవీలో ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించడానికి సన్నాహాలు చేసుకున్నారు.

విద్యా దీవెనకు జాయింట్ అకౌంట్ అవసరం

ఏలూరు (టూటౌన్): జగనన్న విద్యా దీవెన పథకం 4వ విడత లబ్ధి పొందేందుకు ఈ నెల 24 లోగా ఏదైనా జాతీయ బ్యాంకులో విద్యార్థి, తల్లితో కూడిన జాయింట్ అకౌంట్‌ను ఓపెన్ చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాష్ ఒక ప్రకటనలో కోరారు. ఈ విద్యాసంవత్సరం 2022–23లో ఫైనల్ ఇయర్ పూర్తయిన వారు, ఎస్సీ విద్యార్థులు మినహా మిగిలిన వారు తప్పనిసరిగా జాయింట్ ఖాతా ఓపెన్ చేయాలన్నారు. విద్యార్థి ప్రైమరీ అకౌంట్ హోల్డర్‌గా, తల్లి సెకెండరీ హోల్డర్‌గా ఉండాలని పేర్కొన్నారు. ఒక వేళ తల్లి మరణిస్తే తండ్రి లేదా సంరక్షకుడు సెకండరీ అకౌంట్ హోల్డర్‌గా ఉండాలని సూచించారు. కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే అందరూ కలిసి ఒకే బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయవచ్చని తెలిపారు. ఏటీఎం, నెట్ బ్యాంకింగ్ సేవలు ఉండకూడదన్నారు. జాయింట్ ఖాతాకు ఆధార్ సీడింగ్ అవసరం లేదని చెప్పారు.

భూ హక్కు పత్రాల పంపిణీకి ఆదేశం

అధికారులతో జేసీ రామసుందర్ రెడ్డి



భీమవరం (ప్రకాశంచౌక్): అర్హులైన లబ్ధిదారులకు అసైన్డ్ భూముల హక్కు పత్రాలను వెంటనే పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో లంక భూములు, ఫ్రీ హోల్డ్ రైట్స్, ఇనాం భూములు, షెడ్యూల్ క్యాస్ట్ ఏరియాలో శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాల్స్, ఎస్సీ కార్పొరేషన్ భూములుతదితర 9 అంశాలపై సంబంధిత ఆర్డీవోలు, మండల అధికారులతో జాయింటు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ సర్వే పనులు సకాలంలో పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం చురుగ్గా పని చేయాలన్నారు. ముఖ్యమంత్రి పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారని.. జిల్లాలో కూడా స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో లంక భూములు 823 ఎకరాలు లబ్ధిదారులకు పంపిణీ చేయాలని అన్నారు. అసైన్డ్ భూమి – ఫ్రీ హోల్డ్ 20 మండలాల్లో 583 మంది లబ్ధిదారులకు 249.10 ఎకరాలు లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ భూములు ఆకివీడు మండలం గుమ్ములూరు గ్రామంలో 33 మంది లబ్ధిదారులకు 16.15 ఎకరాల పట్టాలు సిద్ధం చేయాలన్నారు.

కాల్వలో వ్యక్తి మృతదేహం లభ్యం


తణుకు గోస్తనీ కాల్వలో లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం

తణుకు: తణుకు పట్టణ పరిధిలోని గోస్తనీ కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు గుర్తించారు. వెంకట్రాయపురం పరిధిలోని ఆంధ్రాసుగర్స్ సమీపంలో గోస్తనీ కాల్వలో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు నీలం రంగు టీషర్టు, నీలం రంగు జీన్స్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన 9440796640, 9154965934 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

నగదు బ్యాగ్ చోరీ

పాలకొల్లు సెంట్రల్: బ్యాంకు నుంచి నగదు తీసుకొస్తున్న వృద్ధుడి నుంచి ఇద్దరు యువకులు బ్యాగ్‌ను దొంగిలించిన సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడు పప్పు మోహనరావు వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన అతను కొంత కాలంగా పూలపల్లి వృద్ధాశ్రమంలో ఉంటున్నాడు. ధవళేశ్వరం బ్యాంకులో ఉన్న నగదు తీసుకుని అకౌంట్ రద్దు చేసుకుందామని శుక్రవారం తనతోపాటు వృద్ధాశ్రమంలో ఉంటున్న ఓ స్నేహితుడిని తోడుగా తీసుకుని వెళ్లారు. బ్యాంకులో నగదు రూ. 2.90 లక్షలు తీసుకుని ధవళేశ్వరం నుంచి పాలకొల్లు వచ్చారు. బస్టాండ్‌లో పార్క్ చేసిన వాహనంపై వెనుక కూర్చోగా అతని మిత్రుడు వాహనం నడుపుతున్నాడు. పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి మరో బైక్‌పై తమను వెంబడిస్తున్న ఇద్దరు యువకులు నగదు బ్యాగ్‌ను లాక్కుని వేగంగా వెళ్లిపోయారు. వారిని అనుసరిస్తూ ఆ వాహనాన్ని వెంబడించగా రైల్వే స్టేషన్ రోడ్డుకు పారిపోయారు. కేకలు వేయడంతో స్థానిక యువకులు వారి వెంట పరుగులు తీశారు. రైల్వే ట్రాక్ చివర వాహనాన్ని వదిలేసి చెరో వైపు పారిపోగా స్థానికులు ఒకరిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాధితుడు మోహనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం


పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: నరసాపురం ఆఫీసర్స్ క్లబ్ వేదికగా 5 రోజుల పాటు నిర్వహించనున్న కొవ్వలి ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్–2023 శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఐ కొవ్వలి రామ్మోహన్‌నాయుడు టోర్నమెంట్ నిర్వహణకు ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమన్నారు. సీనియర్ టెన్నిస్ ప్లేయర్, వైఎస్సార్‌సీపీ నేత సీహెచ్ చినరెడ్డప్ప ధవేజీ మాట్లాడుతూ నరసాపురం టెన్నిస్ పేరు చెపితే ఎంవీ రావు, ఎన్వీరావు గుర్తుకు వస్తారని చెప్పారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి కానూరి బుజ్జి మాట్లాడుతూ 45 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వయసు క్రీడాకారులతో మొత్తం 48 మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. మంగళవారం ఫైనల్ పోటీలో విజేతలకు రూ. 5 లక్షల ప్రైజ్ మనీ అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కొవ్వలి చతిరాజరామ్మోహన్‌నాయుడు, కటకంశెట్టి నారాయణరావు, కేవీఎస్‌ఆర్ మోహన్‌రావు, చెరుకూరి దత్తాత్రేయవర్మ, డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేపై అవగాహన


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): కులగణన సర్వే ఎంతో సున్నితమైన అంశమని, ఓపిగ్గా విషయాన్ని సేకరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. శుక్రవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో రాష్ట్ర కుల గణన సర్వేపై అవగాహన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నవంబర్ 27 నుంచి డిసెంబర్ 10 వరకు జిల్లాలో కుల గణన జరుగుతుందన్నారు. దీనికి యంత్రాంగం సిద్ధం కావాలని ఆదేశించారు. కులగణన గురించి ముందుగానే వలంటీర్ల ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించి, అపోహలను తొలగించాలని సూచించారు. సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలనే నమోదు చేయాలని, వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను అడగాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్నవారికి, ఎవరి కులం వారికే నమోదు చేయాలన్నారు. ఎవరైనా కులం పేరు చెప్పడానికి ఇష్టపడకపోతే, వారిని బలవంతం చేయవద్దని, ఇది స్వచ్ఛందమేనని స్పష్టం చేశారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపల్, ప్లానింగ్, సంక్షేమ శాఖల నుంచి ఎంపిక చేసిన సూపర్‌వైజర్‌లు ఈ సర్వేను పర్యవేక్షిస్తారన్నారు. వివరాలు నమోదు చేయడం కోసం ప్రత్యేక యాప్ త్వరలో అందుబాటులోకి రానుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, డీఆర్‌ఓ కె కృష్ణవేణి, ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, యం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కోచ్‌గా మహదేవపట్నం పీడీ

ఉండి: ఈ నెల 23 నుంచి 27 వరకు అగర్తలాలో నిర్వహించే జాతీయ యోగా పోటీలకు మహదేవపట్నం జెడ్పీ హైస్కూల్ పీడీగా ఉన్న గాదిరాజు వెంకటకృష్ణంరాజు ఎంపికయ్యారు. తనతో పాటు మహమ్మద్ కుర్దూస్(శృంగవృక్షం), గంగా మహేష్(శివదేవుని చిక్కాల) కూడా కోచ్‌లుగా ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

మంత్రి కారుమూరిని కలిసిన కమిషనర్ వెంకటరమణ


మంత్రి కారుమూరికి మొక్క అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరమణ మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి మొక్కను అందచేశారు.

బలుసులమ్మకు విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. దాతలు పండూరి సత్యనారాయణ, చక్రవేణి, వెదర్ష్ నాయుడు, బోసు, తేజశ్రీ, రిత్విక్ తదితరులు సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు పర్యవేక్షించారు. భక్తులు భారీగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

9న జాతీయ లోక్ అదాలత్

తణుకు అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వచ్చేనెల 9వ తేదీన తణుకు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. శుక్రవారం తణుకు కోర్టులో విలేకరులకు జాతీయ లోక్ అదాలత్‌పై వివరాలు వెల్లడించారు. రాజీకాదగ్గ క్రిమినల్, అన్ని సివిల్ కేసులు, ప్రీలిటిగేషన్, మోటారు వాహన ప్రమాద కేసులు రాజీ చేసుకోవచ్చని సూచించారు. కక్షిదారులు ఈ జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగపరచుకోవాలని కోరారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

తాడేపల్లిగూడెం రూరల్: ధాన్యం ఎగుమతి, దిగుమతుల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొమ్ముగూడెం సొసైటీలో ధాన్యం లోడింగ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ వీరంపాలెం గ్రామం నుంచి 15 లోడుల ధాన్యం మిల్లులకు పంపించామన్నారు. లారీ వెళ్లిన నాలుగు గంటల్లో ధాన్యం దిగుమతి చేసి, వెను తిరిగి వచ్చిందన్నారు. ఆయన వెంట ఆర్‌బీకే ఇన్‌చార్జ్ శివరాం, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయాలి


తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ వీరన్న, తదితరులు


అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం తణుకులో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంట్ర వీరన్న అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం సంచారజాతులకు చెందిన యువతకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంచార జాతులను గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమకు గౌరవ ప్రతిష్టలు కట్టబెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని సంచార జాతుల యువత అంతా నడుంకట్టాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు జగనన్న అందిస్తున్న సంక్షేమం చరిత్రాత్మకమన్నారు. ఈ కార్యక్రమంలో సంచార జాతుల సంఘ నాయకులు పెద్దిరాజు, కె. ఎల్లయ్య, బొడ్డు ఏసు, కె.భవాని, దారం వీరయ్య పాల్గొన్నారు.

అత్తిలిలో: తణుకు పట్టణంలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ కోరారు. శుక్రవారం అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మండల పార్టీనాయకులు కోరుకొల్లు వెంకట్రావు, కంకటాల సతీష్, కాకర్ల విశాలాక్షి, కంకటాల సతీష్, రాయుడు ధర్మారావు, గారపాటి నాగరాజు, కందుల సత్యనారాయణ, చిటకన వెంకట్రావు, కసిరెడ్డి బాలాజీ, పెచ్చెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

ఓ మంచి నేస్తం.. పుస్తకం


తాడేపల్లిగూడెం టీఓసీ : ఏకపాత్ర అభినయం చేసిన కోపల్లె శ్రీనివాసరావును సన్మానిస్తున్న గ్రంథాలయ సభ్యులు


పెంటపాడు : సమావేశంలో మాట్లాడుతున్న రచయితల సంఘం నాయకుడు సుంకర గోపాల్


అత్తిలి: వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పుస్తకాలే ఓ మంచి నేస్తాలని, గ్రంథాలయాల్లో పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన సాధ్యమని పలువురు వక్తలు తెలిపారు. పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో గ్రంథాలయా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు, గరికపాటి బాపయ్య శర్మ, దాసి మోహన్‌రావు, సాల్మన్‌రాజు, పత్తి వీరాస్వామి, కొత్తపల్లి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. కోపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాహిత్యం ద్వారానే సామాజిక విప్లవాలు

తణుకు టౌన్: సాహిత్యం ద్వారానే సామాజిక విప్లవాలు వచ్చాయని ప్రముఖ విద్యావేత్త, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య చెప్పారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా తణుకులోని పురుషుల శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో తాడినాడ భాస్కరరావు, పొట్లచెరువు కృష్ణ, గ్రంథాలయ అధికారిణి కే సుగుణకుమారి, పృథ్వీ నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

అత్తిలి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రంథాలయాలు ఉపయోగాలు అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

కవిత్వం, రచనలపై అవగాహన అవసరం

పెంటపాడు: కవితలు, రచనలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రముఖ రచయిత, సాహితీవేత్తలు సుంకర గోపాల్, గోదావరి ప్రభాకర శాస్త్రిలు పేర్కొన్నారు. శుక్రవారం పెంటపాడు శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం కార్యక్రమం గ్రంథాలయాధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

మినుముపై సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

తాడేపల్లిగూడెం రూరల్: మినుముపై మారుకా పురుగు ఉధృతి కనిపిస్తోందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పట్టింపాలెం, కొమ్ముగూడెం, నీలాద్రిపురం, వీరంపాలెం గ్రామాల్లోని ఆయన పర్యటించి, మినుము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ దాదాపు 1600 ఎకరాల్లో మినుము సాగవుతుందన్నారు. పురుగు ఉధృతి తక్కువగా ఉంటే ఎసిఫేట్ ఒక గ్రాము లేదా క్లోరోఫైరిపాస్ రెండు ఎంఎల్ లేదా ట్రైమోడికార్బ్ ఒక గ్రాము మందును డైక్లోరోవాస్ ఒక మిల్లీ లీటర్లతో కలిపి పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే నవల్యూరాన్ 1.0 ఎంఎల్ లేదా స్పైనోసాడ్ 0.3 గ్రాములు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు ఒక లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు.

చిన్నారులకు నిత్యావసర సరుకుల పంపిణీ

తణుకు అర్బన్: హెచ్ఐవీ బాధిత చిన్నారులకు అండగా నిలబడడం అభినందనీయమని తణుకు సేఫ్ కేర్ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పుప్పాల రాజరాజేశ్వరి అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో ఉన్న సేఫ్ కేర్ సెంటర్‌లో శుక్రవారం హెచ్ఐవీ బాధిత చిన్నారులకు తణుకుకు చెందిన పారిశ్రామికవేత్త, గౌతమీ సాల్వెంట్ అధినేత మల్లిన రామచంద్రరావు సౌజన్యంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేఫ్ కేర్ సెంటర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే వండి పెట్టండి

ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


విద్యార్థుల నుంచి మధ్యాహ్న భోజనం వివరాలను తెలుసుకుంటున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : మధ్యాహ్న భోజనాన్ని స్కూల్‌లోనే వండి పంపిణీ చేయాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తనిఖీ చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్న భోజనానికి ప్రాముఖ్యత నిస్తున్నారని తెలిపారు. బడి పిల్లలకు పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. తప్పనిసరిగా మెనూ పాటించేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులను నాణ్యత, పోషకాలు లేని భోజనం పెడితే చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొట్టు వెంట మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, బోణం విజయనిర్మల, కొలుకులూరి ధర్మరాజు, బొడ్డు సాయిబాబా, సంపతరావు కృష్ణారావు, చామన సూర్యచంద్రరావు, వట్టి బుజ్జి, రాజా త్రినాథ్, పత్సమట్ల సావిత్రి, తాడిపర్తి రజని తదితరులు ఉన్నారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు


పుట్ట వద్ద పూజలు చేస్తున్న గుబ్బల తమ్మయ్య

పెంటపాడు, తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నాగుల చవితి పర్వదిన వేడుకలను మహిళలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి, ఉపవాస దీక్షతో పట్టణ, పల్లెల్లోని శివాలయాల్లోని ఇతర నాగులపుట్టల వద్దకు కుటుంబ సభ్యులతో తరలివచ్చి, సాంప్రదాయ బద్ధంగా పుట్టకు పాలు పోసి, కోడి గుడ్ల పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. పట్టణంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెంటపాడు మండలంలోని మీనవల్లూరు గ్రామంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ అధ్యక్షుడు గుబ్బల తమ్మయ్య నాగులమ్మ పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంటి గుమ్మంలోకే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యసేవలు


తణుకులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న సూర్య

తణుకు అర్బన్: ఇంటి గుమ్మంలోకే వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య అన్నారు. తణుకు రెడ్‌క్రాస్ భవనం ప్రాంతంలో శుక్రవారం 18, 19 వార్డులకు సంబంధించి నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మందికి అనారోగ్య సమస్యలు గుర్తించి వారిని మెరుగైన వైద్యసేవలకు రిఫర్ చేయడమైందన్నారు. ఈ కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు, బలిజేపల్లి రవిశంకర్, కొమ్మోజు రామకృష్ణ, వి.సీతారాం, లంక వెంకట్రావు, బెల్లం హరినాథ్, బొచ్చు ప్రసాద్, మొహిద్దీన్, అన్సారీ, టీపీ నాగిరెడ్డి, రేలంగి రాంబాబు, జిలాని, జయరాజు, సచివాలయ ఏఎన్ఎంలు, సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాల్లో చెత్తా చెదారాలు వేయరాదు

తాడేపల్లిగూడెం రూరల్: ఇంటి పరిసరాల్లో చెత్తా, చెదారాలు వేయడం వల్ల దోమలు వృద్ధిచెందుతాయని మలేరియా తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పెదతాడేపల్లి–1,2 సచివాలయాల పరిధిలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం, అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

